
# ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి ములుగు

5

శనివారం 7 డిసెంబరు 2024


(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేటితో ఏడాదవుతోంది. హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ప్రజాపాలన పేరుతో సర్కారు ప్రత్యేక దృష్టి సారించడంతో దశాబ్దాల తరబడి కలగా మిగిలిన అభివృద్ధి పనుల్లో కదలిక మొదలైంది. తెలంగాణకు వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామని హామీలు ఇస్తూనే...అదే స్థాయిలో నిధుల కేటాయింపులు చేస్తోంది. దీంతో దీంతో 50ఏళ్లుగా ఎదురు చూస్తున్న మాస్టర్ ప్లాన్.. 30ఏళ్లుగా పడకేసిన భూగర్భ డ్రెయినేజీ పనులు, ఎయిర్‌పోర్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, మాఢ వీధుల పనులు కార్యరూపం దాల్చాయి. కాళోజీ కళాక్షేత్రం సాక్షాత్కారమైంది. ఏడాది కాలంలో ఓరుగల్లు అభివృద్ధికి ఎన్నో అడుగులు పడ్డాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

## కాంగ్రెస్ పాలనకు ఏడాది..

అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసింది. 12 అసెంబ్లీ స్థానాలు ఉంటే పది చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. వరంగల్ తూర్పు, ములుగు నియోజకవర్గాల నుంచి గెలిచిన ఇద్దరు మహిళలు కొండా సురేఖ, సీతక్క రేవంత్ కేబినెట్‌లో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయ దుందుభి మోగించింది. వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలను సైతం కాంగ్రెస్ విజయం సాధించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా స్టేషన్‌ఘనపూర్ నుంచి విజయం సాధించిన కడియం శ్రీహరి సైతం హస్తం గూటికి చేరుకోవడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంఖ్య 11కు చేరింది. రాజకీయంగా ఓరుగల్లులో కాంగ్రెస్ పార్టీ ఈ ఏడాది కాలంలో పైచేయి సాధించింది.



# ఏడాదిలో.. ఏన్నో అడుగులు!

- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి
- నేటితో కాంగ్రెస్ ప్రజాపాలనకు సంవత్సరం
- వరంగల్‌ను రెండో రాజధాని చేసేలా ప్రణాళిక
- నగరంలో అభివృద్ధి పనులకు రూ.4,962కోట్లు మంజూరు
- ఎయిర్‌పోర్టు భూసేకరణకు రూ.205కోట్లు.. వస్త్రనగరిపై ప్రత్యేక ఫోకస్
- భూపాలపల్లిలో మైలారం గుట్టల్లో ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు
- రూ.286కోట్లతో చిన్న కాళేశ్వరం పనులు ముమ్మరం
- 2026మార్చి నాటికి దేవాదుల పూర్తికి ప్రణాళిక
- పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు పనులకు మోక్షం

## ఓరుగల్లు అభివృద్ధికి ప్రణాళికలు

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను తెలంగాణకు రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామని సీఎం సహా మంత్రులు, ఎమ్మెల్యేలు హామీలు ఇస్తున్నారు. అదేస్థాయిలో నిధులు కూడా విడుదల చేస్తున్నారు. ఒక్క వరంగల్ నగరాభివృద్ధికే రూ.4,968 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వరంగల్ నగరంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అనేక పనులను పూర్తి చేసి కాంగ్రెస్ ప్రభుత్వ మార్కును ప్రజల్లోకి తీసుకెళ్లతున్నారు. ప్రధానంగా 30ఏళ్లుగా ఎదురు చూస్తున్న భూగర్భ డ్రెయినేజీకి రూ.4,170కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 55ఏళ్ల అమలుకు నోచుకోని వరంగల్ మాస్టర్‌ప్లాన్‌ను ఆమోదించింది. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేయలేని ప్రజాకవి కాళోజీ నారాయణరావు కళాక్షేత్రాన్ని రూ.95కోట్లతో పూర్తి చేసింది. వరంగల్ ఎయిర్‌పోర్టుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న 150కి.మీ నిబంధనపై జీఎంఆర్ సంస్థతో మాట్లాడి, ఆ నిబంధన సడలింపు తీసుకరావడమే కాకుండా, 263 ఎకరాల భూసేకరణ కోసం రూ.205కోట్లు విడుదల చేస్తు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అలాగే భూపాలపల్లిలో

మిగతా 7వ పేజీలో...

## అభివృద్ధే కాంగ్రెస్ సర్కారు ధ్యేయం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గణపురంలో రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

గణపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే కాంగ్రెస్ సర్కారు ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలో ఆయన శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. బుర్రకాయలగూడెం, మండల కేంద్రంలో రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బుర్రకాయలగూడెంలో పోచమ్మ అలయ నిర్మాణానికి రూ. 5లక్షలు కేటాయించినట్లు ప్రకటించారు. మండల కేంద్రంలో రోడ్ల విస్తరణకు అందరూ సహకరించాలని కోరారు. మండలాన్ని నియోజక వర్గంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, చోటేమియా, అశోక్, రాజమౌళి, కట్కూరి శ్రీనివాస్, దేవేందర్, శివశంకర్, నారాయణగౌడ్, రాంరెడ్డి, కుమార్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై

# పోరాటాలు ఉధృతం

- బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలపై అలుపెరుగని పోరు
- సమస్యలను పక్కదోవ పట్టించేందుకే బూర్జువా పార్టీల పరస్పర విమర్శలు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. పార్టీ ములుగు జిల్లా రెండో మహాసభలు ఏటూరునాగారంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా తమ్మినేని వీరభద్రం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను పట్టించుకోని బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలపై అలుపెరుగని పోరాటం చేస్తామని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎర్రజెండా వైపు చూస్తున్నారని అన్నారు. పెట్టుబడిదారీ విధానం విచ్ఛిన్నమవుతోందని, శ్రీలంకలో చోటుచేసుకున్న పరిణామాలే ఇందుకు నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక నయా ఉదారవాద విధానాలను వేగంగా అమలవుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను పక్కకు పెట్టి హైడ్రా, మూసీ నది సుంద రీకరణ పేరుతో కాలయాపన చేస్తూ ప్రజా సమస్యలను పక్కదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల్లో రైతు లకు రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయకుం డా మోసం చేసిందన్నారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా వారిని కాంగ్రెస్ ఇబ్బందులకు గురిచే స్తోందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలను కొనసాగి స్తా మన్నారు. బూర్జువా పార్టీలు ఒకరిపై ఒకరు వ్యతిగత దూషణలకు పాల్పడూ ప్రజాసమస్యలపై చర్చ లేకుండా చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే మిడియం బాబూరావు మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ప్రభుత్వాలు సహజ వనరులను దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరో పించారు. గిరిజనుల హక్కులను కాలరాస్తూ వారి ఉనికిని కనుమరుగు చేస్తున్నాయని మండిపడ్డారు. పోడుభూముల్లో అటవీశాఖ అధికారులతో గిరిజనులపై దాడులు చేయిస్తూ అన్యాయం చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, బండారు రవికుమార్, మచ్చ వెంకటేశ్వర్లు, పిట్టల రవి, సాంబశివ, రత్నం రాజేందర్, నాయకులు ఎమ్డీ దావూద్, వసంత నాగయ్య, కొప్పుల రఘుపతి, వాసు, సౌమ్య, వంకరాములు, చిటమట రమేష్ పాల్గొన్నారు.

## యాదవులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

### యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబయ్య



నూతన కార్యవర్గాలతో సాంబయ్య

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదవులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేషబోయిన సాంబయ్య యాదవ్ అన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోరె రవి అధ్యక్షతన ములుగులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవులు ఐక్యతగా ఉండి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం కావాలన్నారు. అనంతరం యాదవ మహాసభ జిల్లా, ములుగు మండల కమిటీలను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా మాదం ఉమామ హేశ్వర్(సాగర్), గౌరవ అధ్యక్షుడిగా నర్రావుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గాదం కుమార్, ఉపాధ్యక్షులుగా మర్రి గట్టయ్య, ఏల్పుల బుచ్చయ్య, కార్యదర్శిగా బక్క రాజ్‌కుమార్, కోశాధికారిగా బాలుగు ఐలయ్య, సహాయ కార్యదర్శిగా భాషబోయిన మాలగం, సభ్యులుగా నర్రావుల ప్రసాద్, భూషబోయిన రమేష్, అప్పుల వెంకన్న, వంగ కొమురయ్యలు ఎన్నికయ్యారు. ములుగు మండల అధ్యక్షుడిగా గొర్రె శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడిగా బైకాని విష్ణు, సభ్యులుగా రవి, నర్రావుల సంపత్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెబాట

### డీఈవోకు నోటీసు అందజేత



డీఈవో రాజేందర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ సమగ్ర శిక్ష లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాటపడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్‌కు నోటీసు అందజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌పాషా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రేగుల సహదేవ్, కంకల రాజయ్య మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో తమకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, మినిమం టైం స్కేల్ ప్రకటించాలని, ప్రతి ఉద్యోగికీ జీవిత బీమా రూ.20 లక్షలు ప్రకటించాలని, ఆరోగ్య బీమా రూ.10లక్షలు ఇవ్వాలని, పదవి విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలని, విద్యాశాఖ నియమాకాల్లో వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల వేణు, నాయకులు చంద్రకళ, మహేందర్, సత్యనారాయణ, వేణు, నరేష్, కుమార్, రాజు, సుదర్శన్, కనకలక్ష్మి, హరీష్, మల్లికార్జున్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ఇద్దరి రిమాండ్

క్రైం కార్నర్

మహదేవపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో ఇద్దరిని మహదేవపూర్ పోలీసులు శుక్రవారం రిమాండ్ కు తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవ పూర్ మండల కేంద్రంలోని తుంగలవాడకు చెందిన తుంగల రా జయ్య, అతడి చెల్లి సుంకె ఈశ్వరికి కొన్నేళ్లుగా భూతగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో రాజయ్య, అతడి కొడుకు వినయ్‌కుమా ర్ గురువారం గొడ్డలిని తీసుకుని ఈశ్వరి కొడుకు మహేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. తల్లి ఈశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం రాజ య్య, వినయ్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డుపై తీవ్ర గాయాలతో శివకుమార్

కాటారం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చింతకాని క్రాస్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. కాటారం ఎస్సై మ్యాక అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ముత్తారం గ్రామపంచాయతీ పరిధిలోని ధర్మాబాద్ గ్రామానికి చెందిన ఆడెపు శివకుమార్(21) ఫొటో, వీడియోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం స్నేహితుడు గంధం వీరస్వామితో కలిసి బైక్‌పై పెళ్లి వేడుకలో ఫొటోలు తీయడానికి భూపాలపల్లికి బయల్దేరాడు. ఈ క్రమంలో కాటారం శివారులోని చింతకాని క్రాస్ సమీపంలో బైక్‌ను బొగ్గు టిప్పర్ ఢీకొనడంతో శివకుమార్‌కు తీవ్రగాయాలు కాగా వీరస్వామి స్వల్పంగా గాయపడ్డాడు. దీంతో క్షతగాత్రులకు స్థానికంగా ప్రాథమిక చేయించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా శివకుమార్ మృతిచెందాడు. ఘటన స్థలం నుంచి డ్రైవర్ పారిపోవడంతో పోలీసులు టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి సోదరుడు రోహిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## దాడి కేసులో ఇద్దరి రిమాండ్



నిందితులను చూపిస్తున్న పోలీసులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాశీంపల్లి గ్రామంలో ఈ నెల 4న పెళ్లి వేడుకల్లో గొడవ పడి ఓ వ్యక్తిని కొట్టి, హత్యాయత్నం చేసిన ఇద్దరిని రిమాండ్ పంపినట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఖాశీంపల్లికి చెందిన జోరు రాజ్‌కుమార్, జోరు సంతోష్ ఇదే గ్రామానికి చెందిన పుట్ట సాగర్‌తో ఓ వివాహ వేడుకల్లో గొడవ పడి అతడిని కొట్టారు. ఆ సమయంలో భయంతో అతడు పుట్ట రవీందర్ అనే వ్యక్తి ఇంటి వైపు వచ్చి తప్పించుకొని పారిపోయాడు. అనంతరం కొద్దిసేపటికి రాజ్‌కుమార్, సంతోష్ అక్కడికి వచ్చి సాగర్ ఆచూకీ తెలపాలంటూ కత్తి చేతపట్టి హంగామా చేశారు. తనపై జరిగిన దాడిపై సాగర్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి, విచారణ అనంతరం రాజ్‌కుమార్, సంతోష్‌ను అరెస్టు చేసి పరకాల జ్యుడీషియల్ కోర్టులో హాజరు పర్చామని సీఐ వెల్లడించారు.

# ప్రజలను వంచించిన కాంగ్రెస్

### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



ప్రజా వంచన దినంలో పుట్ట మధు, బీఆర్ఎస్ నాయకులు

కాటారం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని వర్గాలను వంచించిందని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజావంచన దినం పేరిట నిరసన కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఎన్నికల మెనిఫెస్టోలో పలు హామీలను పొందుపర్చి, వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్కదాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేసిన పాపానపోలేదని మండిపడ్డారు. ప్రశ్నించేవారిపై కేసులు పెడుతున్నారని, పోలీసులు అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భూపాలలపల్లి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు జక్కు రాకేష్, మందల లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఉప్పు సంతోష్, పంతకాని సడువలి, వెంకటస్వామి, గాలి సడవలి, జక్కు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్నవరం తైబందీ ఖరారు

### 4,150 ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి తీర్మానం

గోవిందరావుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్నవరం సరస్సు కింద రబీ పంట సాగు కోసం 4,150 ఎకరాలకు నీరు ఇవ్వడానికి అధికారులు, రైతులు తీర్మానం చేశారు. శుక్రవారం గోవిందరావుపేట రైతువేదికలో యాసంగి సాగుపై తైబందీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఇరిగేషన్ ఈఈ కె.నారాయణ మాట్లాడుతూ యాసంగి సాగుకు శ్రీరాంపతి, నర్సింహుల కాల్వల ద్వారా 4,150 ఎకరాలకు సాగునీటిని ఇవ్వనున్నట్లు తెలిపారు. మోటార్ల ద్వారా ఎవరైనా అక్రమంగా సాగునీటిని వాడుకుంటే కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఈ సీహెచ్.శ్రీనివాస్, ఎంఏవో జితేందర్‌రెడ్డి, ఏఈలు క్రాంతికుమార్, ఉపేందర్‌రెడ్డి, అర్షద్, దీపక్, రైతులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ సంఘాల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ పీడీఎఫ్ పత్రికలో జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకరను ఉద్దేశిస్తూ అనుచిత పదాలతో వార్తను ప్రచురించడాన్ని ఖండిస్తూ ఉద్యోగ సంఘాల జేఏసీ, టీజీవోస్, టీఎన్జీవోస్, జిల్లా ఆఫీసర్ల అసోసియేషన్, టీజీటీఏ, టీఆర్‌ఈఎస్ఏ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట రెవెన్యూ శివారులోని 359 సర్వే నంబర్‌లో గల భూమికి సంబంధించి కలెక్టర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తూ అసభ్య పదాలను ఉపయోగిస్తూ వార్తను ప్రచురించడం బాధాకరమన్నారు. ప్రజా ప్రయోజనాల ను కాపాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం కలెక్టర్, అధికారులమంతా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, ఈక్రమంలో తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వార్తలు ప్రచురించడం సరికాదని అన్నారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, ఉద్యోగ సంఘాల నాయకులు అల్లం రాజ్‌కుమార్, రాంప తి, రాజు, పోరిక సునీల్‌కుమార్, ప్రసాద్, రామకృష్ణ, కుమారస్వామి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైకల్యాన్ని జయించిన పేద యువతి



గోల్డ్‌మెడల్‌తో జ్యోతి

- అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన జ్యోతి
- దేశం నుంచి ప్రాతినిధ్యం వహించి గోల్డ్‌మెడల్ కైవసం
- హర్షం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

వివరాలు 7లో..

## బాబా సాహెబ్ అంబేద్కర్‌కు ఘన నివాళి

భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వర్ధంతి

8వ పేజీలో

## జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మేనేజర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్ ఘన్‌పూర్ హైస్కూల్ పీడీ వంచ చంద్రశేఖర్ రెడ్డి జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు మేనేజర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సారంగపాణి ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రశేఖర్ రెడ్డి ఈనెల 7 నుంచి 11 వరకు ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో నిర్వహించే 39వ జాతీయ జూనియన్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. జనగామ జిల్లా అథ్లెటిక్స్ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న చంద్రశేఖర్ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎం.సంపత్, సంఘ నాయకులు పి.వెంకటేశ్వర్ రెడ్డి, ఆవుల అశోక్, జె.గోర్ సింగ్, జి.రాజు, ప్రమోద్ రెడ్డి, సుభాష్, రమేశ్, సురేష్, రంజిత్ అభినందించారు.

## గూడ్స్ రైలు బోగీలో పొగలు



స్టేషన్‌ఘన్‌పూర్ వద్ద గూడ్స్ బోగీలో నుంచి వస్తున్న పొగలు

స్టేషన్‌ఘన్‌పూర్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు బొగ్గులోడుతో వెళ్తున్న వైటీపీపై గూడ్స్ రైలు స్టేషన్‌ఘన్‌పూర్‌కు సమీపిస్తుండగా శుక్రవారం బోగిలో పొగలు వచ్చాయి. సమాచారాన్ని అందుకున్న రైల్వే అధికారులు రైలును స్టేషన్‌ఘన్‌పూర్ వద్ద నిలిపేశారు. రైల్వే అధికారులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ వెంటనే స్టేషన్‌కు చేరుకుంది. స్టేషన్‌మాస్టర్ విద్యుత్ కంట్రోలర్‌కు సమాచారమిచ్చి సరఫరాను నిలిపేసి పొగలను నియంత్రించారు. దీంతో రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే పొగలు రావడానికి గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది.

## ధర్మ సమాజ్ పార్టీ రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని, ప్రతి గ్రామంలో అత్యాధునిక పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ములుగులో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు మల్యాల మనోహర్, జిల్లా నాయకుడు కరుణాకర్‌లు మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ప్రతి గ్రామంలో ఆధునిక ఆస్పత్రిని నిర్మించాలని, ప్రజలకు గౌరవప్రదమైన పని కల్పించాలని కోరారు. అర్హులైన వారికి సాగునీటి సౌకర్యంతో ఎకరం వ్యవసాయ భూమిని కేటాయించాలని, నిరుపేదలకు 200 గజాల స్థలంలో డబుల్‌బెడ్‌రూం ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈదీక్షలో పార్టీ నాయకులు శేఖర్, చిరంజీవి, ప్రణయ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## 'నేటి ఆటోల బంద్‌ను జయప్రదం చేయండి'



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగన్న

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జరుపతలపెట్టిన ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గాడిపెల్లి శ్యామ్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో బంద్‌ను జయప్రదం చేయాలని కోరు తూ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారిన ఆటోడ్రైవర్ల బతుకులు మారడంలేదని వాపోయారు. రవాణా రంగంలో ఉన్న కార్మికుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాం డ్ చేశారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ. 12 వేల ఇస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాక దర్తయ్య, తిరుపతి, చంద్రశేఖర్, నాగరాజు, నవీన్, లాలు, అనిల్, పాపయ్య, లింగన్న, వెంకటేష్, రాము పాల్గొన్నారు.





**WANTED**

★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్స్, సిస్టమ్ ఆపరేటర్స్ అర్జెంటుగ కావలెను. జీతం : 8,000-10,000. సంప్ర:9000463426

AJW-199484

**WANTED**

★ కాళ్ళ పద్మావతి ఫార్మసీ కాలేజీలో లేడీస్ హాస్టల్ నందు పనిచేయుటకు అనుభవం గల లేడీ వార్డెన్, వంటమనుషులు అర్జెంటుగా కావలెను. చిరునామా : ఉర్సుగుట్ట, వరంగల్ Phone No : 9908760511, 9908128154

AJM-12568

**CHANGE OF NAME**

★ I, TAYABUNISSA BEGUM (Old Name), H.No : 7-5-1, Machili Bazar, Hanumakonda Dist -506011, T.S. Have Changed My Name As TAYABUNISA BEGUM (New Name), W/o. AFZAL AHMED KHAN, for all Purposes

AJW-5748

**COMMERCIAL SPACE FOR RENT**

★ 2250 Sft fully Furnished office Space Available for Rent. NGO's Colony main Road Near Sumangali Function Hall. Cont : 9502299500, 9849155229

AJW-199457

**BUSINESS**

★ Wanted Investors / Partners మేము చేయబోయే అన్‌లైన్ బిజినెస్‌కి 15 లక్షలు పెట్టుబడి కావలెను. ఇన్వెస్టర్స్ / పార్ట్‌నర్స్ కావలెను. ఇంట్రెస్టెడ్ ఉన్నవాళ్లు సంప్రదించండి. ఫోన్: +91 799 344 8663 హైదరాబాద్

AJH-1199

**FLAT FOR SALE**

★ Hunter Road, Warangal 3BHK Flat 1970 sft 2nd Floor, with Wood Work @Yathiraja Nilayam. Ph: 9849455000, 9490022014

AJH-15325

**PLOT FOR SALE**

★ మడికొండలోని రైల్వే లైన్ అవతల గల జిబిల్ హోమ్స్ దగ్గర్లో 622 చ॥గ తూర్పు పేస్ స్థలం అమ్మకమునకు కలదు. తక్కువ ధరలో గల స్థలం మీ యొక్క భవిష్యత్తు అవసరాలకు అభివృద్ధి చెందుతుంది. సంప్ర॥ 9494417506, 9989138487

AJW-199482

**సెక్యూరిటీగార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను**

★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం 12,000-15,000.సం॥ప్ర॥ 8309693457

AJW-199483

**ప్రకటనల కొరకు సంప్రదించండి**

హన్మకొండ
9985400013
8978510273
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

**3+2 స్కీం కలదు**


# రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి

- చెక్కుల పంపిణీలో ఆలస్యం చేయవద్దు
- అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- జనగామలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- యశ్వంతాపూర్ శివారులో టీఎన్జీవో భవన నిర్మాణానికి శంకుస్థాపన



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న మంత్రి కొండా సురేఖ

జనగామ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. జనగామ జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా వచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోందని, త్వరలోనే అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఆలస్యమయ్యేదని, అలా జరగొద్దని కలెక్టర్‌కు సూచించారు.

కొమురవెల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంత్రి సురేఖను కోరగా ఆమె స్పందించారు. దేవాలయాల అభివృద్ధి విషయంలో తాము ఎలాంటి రాజకీయాలకు తావు ఇవ్వబోమన్నారు. ఏదైనా రెండు దేవాలయాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పంపితే, తప్పకుండా సహకరిస్తానని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

### పల్లా కాంగ్రెస్‌లోకి రారు..

మంత్రి సురేఖ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిఖార్సైన బీఆర్ఎస్ నాయకుడని, ఆయన కాంగ్రెస్‌లోకి రారని వ్యాఖ్యానించారు. పల్లా అజాత శత్రువు అని, ఆయన వ్యక్తిత్వం తనకు తెలుసనన్నారు. జనగామలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఓడిపోవడంతో నియోజకవర్గంలో మొదట్లో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఇలాంటి పరిస్థితులు సరికావని కొమ్మూరిని సముదాయించినట్లు ఆమె తెలిపారు. పార్టీలమధ్య విబేధాలతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో అభివృద్ధి విషయంలో కలిసి మెలిసి పని చేయాలనే నిర్ణయానికి వచ్చామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనగామ మినహా మరెక్కడా తమకు ఇబ్బందికర పరిస్థితులు లేవన్నారు. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లోకి రావడంతో స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇబ్బందికర పరిస్థితులు లేవన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులను కూడా కచ్చితంగా కలుపుకొని పోవాలని పల్లాకు ఆమె సూచించారు. కొమురవెల్లి దేవస్థాన అభివృద్ధిపై సమీక్షాసమావేశంలో కొండా సురేఖ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వావాదం జరిగ్గా అప్పట్లో అది చర్చనీయాంశం అయింది. కాగా.. తాజాగా జనగామ ఎమ్మెల్యే పల్లాను పొగుడుతూ ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కల్గించాయి.

### జనగామ అభివృద్ధికి నిధులు కేటాయించాలి : పల్లా

జనగామ నియోజకవర్గం, కొమురవెల్లి దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రిని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. కొమురవెల్లి దేవాలయ ప్రతిష్ఠను మరింతగా పెంచేలా చూడాలన్నారు. సొంత తమ్ముడి మీద ఉన్నట్లుగా తన మీద, జనగామ నియోజకవర్గం మీద ప్రేమతో నిధులు ఇవ్వాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్ స్వరూప, ఆర్డీవో గోపీనాథ్ పాల్గొన్నారు.

### టీఎన్జీవో భవన నిర్మాణానికి శంకుస్థాపన

జనగామ మండలం యశ్వంతాపూర్ శివారులో నిర్మించనున్న తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్జీవో) జనగామ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషాతో కలిసి మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12 గంటలకు మంత్రి రావాల్సి ఉండగా ఇతరత్రా కార్యక్రమాలతో సాయంత్రం 4.30 కు ఆమె వచ్చారు. భూమిపూజ అనంతరం టీఎన్జీవో సమావేశంలో ఆమె పాల్గొనాల్సి ఉండగా సమయాభావంతో పాల్గొనలేదు. శంకుస్థాపనలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, టీఎన్జీవో సంఘ నాయకులు పాల్గొన్నారు.

**క్రైం కార్నర్**

## గీతకార్మికుడి మృతి

తొర్రూరురూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం. నాంచారిమడూరు గ్రామానికి చెందిన కేశగాని వీరయ్య(57) వృత్తి రీత్యా కల్లుగీత కార్మికుడు. రోజు మాదిరిగానే శుక్రవారం తాటివనంలో చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## చీటింగ్ కేసులో ఒకరికి జైలుశిక్ష

మరిపెడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో ఒకరికి తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మట్ట సరిత సంవత్సరం జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. శుక్రవారం ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... ఎడ్జెర్ల పోస్టు మాస్టర్ బాధవత్ వెంకన్న 2015లో ఆ గ్రామ శివారు పూసల తండాకు చెందిన ఉపాధి కూలీల డబ్బులను వారికి తెలియకుండా వారి అకౌంట్ నుంచి కాజేశాడు. మహబూబాబాద్ అసిస్టెంట్ సూపరిండెంట్ శ్రీధరం ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఆర్.వెంకటేశ్వర్లు పోస్టుమాస్టర్‌పై కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలుచేశారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ గణేశ్‌ఆనంద్, రేవతి వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన తొర్రూరు కోర్టు జడ్జి మట్ట సరిత నిందితుడికి శిక్ష విధించారు. కోర్టు కానిస్టేబుల్ రాంనారాయణను సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు సతీశ్, సంతోశ్ అభినందించారు.

# వెనకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి



కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృషి సారించి ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాదించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు కోట్యానాయక్ నేతృత్వంలో 43 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమన్నారు. పాఠ్యాంశాల్లో ఏమైనా సందేహాలుంటే సబ్జెక్టు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని ఎస్సెస్సీ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఏసీజీఈ ఎం.శ్రీరాములు, డీఎస్వో అప్పారావు, ఏఎస్వో సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

కురవి : పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. కురవి జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎస్సెస్సీ విద్యార్థులకు అందరికి స్టడీ మెటీరియల్, స్నాక్స్‌లను దాతల ద్వారా అందేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, హెచ్‌ఎం వహీద్, ఏఎస్‌వో సంతోష్ పాల్గొన్నారు.

## గృహజ్యోతి లబ్ధిదారుడికి 'షాక్'

- కరెంటు చార్జీలు కట్టమని బిల్లులు



కరెంటు చార్జీలు కట్టమంటూ బిల్లు

రేగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి లబ్ధి దారుడికి విద్యుత్ శాఖ 'షాక్' ఇచ్చింది. జీరో బిల్లు మం జూరైనా కరెంటు చార్జీలు కట్టమని మూడు నెలలుగా బిల్లు వస్తోంది. మండల కేంద్రం శివారు గడిపల్లి గ్రామా నికి చెందిన పోరెడ్డి సాయిరెడ్డి మీటరు నెంబరు 02049406 కలిగి ఉన్నాడు. నెలకు సగటున 75 యూ నిట్ల విద్యుత్ వినియోగిస్తుండటంతో తనకు జీరో బిల్లు అమల్లోకి వచ్చిందని అతడు తెలిపాడు.

అయితే.. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలకు సంబంధించి కరెంటు చార్జీలు కట్టమంటూ తనకు బిల్లులు వస్తున్నాయని సాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. గతం కంటే తక్కువ యూనిట్లు వినియోగించినప్పటికీ చార్జీలు వేయడమేమిటని అతడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయం పై అధికారులను కలిస్తే ఎలాంటి పరిష్కారం చూపట్లే దని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జీరో బిల్ వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

# 11, 12 తేదీల్లో మానుకోటలో సీఎం కప్ క్రీడాపోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భగవాన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ మునిసిపల్ కేంద్రంలో ఈనెల 11, 12 తేదీల్లో సీఎం కప్ క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భగవాన్‌రెడ్డి తెలిపారు. మానుకోట మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం మునిసిపల్ లెవల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కప్ క్రీడల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో రిపోర్టు చేయాలన్నారు. క్రీడా పోటీలకు స్పాన్సర్ చేయదలిచిన వారు మునిసిపల్ ఛైర్మన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ నోముల రవీందర్, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, అధికారులు విజయ్‌కుమార్, ఉపేందర్, చాంప్లా నాయక్, పద్మావతి, శ్రీధర్, కుమారస్వామి పాల్గొన్నారు.

### కమర్షియల్ బ్యాంకులకు

# దీటుగా డీసీసీ బ్యాంక్

- వరంగల్ ఏజీఎం కృష్ణమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కమర్షియల్ బ్యాంకులకు దీటుగా డీసీసీ బ్యాంక్ సేవలందిస్తోందని వరంగల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కృష్ణమోహన్ అన్నారు. గూడూరు డీసీసీ బ్యాంకును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో డిపాజిట్‌లు, వ్యాపారం రూ.960 కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.2100 కోట్ల డిపాజిట్‌లు, వ్యాపారం కొనసాగుతుందన్నారు. రుణ బకాయిలు గతంలో 7 శాతం ఉండగా, ప్రస్తుతం 3శాతానికి తీసుకువచ్చినట్లు చెప్పారు. డీసీసీ బ్యాంక్‌కు ప్రస్తుతం రూ.23 కోట్ల వార్షిక ఆదాయం ఉన్నట్లు తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో 19 బ్యాంకులు ఉండగా, ప్రస్తుతం 32 వరకు పెరిగాయని, వీటికి అనుసంధానంగా నాలుగు మొబైల్ ఏటీఎంలు, 15 ఫిక్స్‌డ్ ఏటీఎంలు, అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ రైతుల పిల్లల విదేశీ చదువు కోసం వ్యవసాయ భూమిపై ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ దశాబ్ది డిపాజిట్‌లపై 8.10 శాతం వడ్డీని పెంచినట్లు తెలిపారు. రైతుల అకౌంట్స్‌లకు పీఎంజేజేవై, పీఎంఎస్‌బీఐ ద్వారా 436 చెల్లించి ఇన్సూరెన్స్ చేసుకోవచ్చని ప్రమాదశాత్తు, సహజ మరణానికి సైతం రూ2 లక్షల ఆర్థిక సాయం బీమా అందించనున్నట్లు చెప్పారు. డిపాజిట్లపై ఇన్సూరెన్స్ గ్యారెంటీ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తు, సాధారణ మరణం పొందితే రూ.5 లక్షల వరకు బీమా ఉంటుందన్నారు. గూడూరు డీసీసీ బ్యాంకులో లాకర్స్ సౌకర్యం ఉందని, ఖాతాదారులు, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ జయశ్రీ పాల్గొన్నారు.

## బీరులో మురికినీళ్లు ఉన్నాయని..

- బ్రాందీషాపు ఎదుట ఆందోళన
- పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం



ఇనుగుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీరులో మురికినీళ్లు ఉన్నాయని ఇనుగుర్తిలోని బ్రాందీషాపు ముందు శుక్రవారం రాత్రి కొందరు యువకులు ఆందోళన వ్యక్తం చేశారు. బ్రాం దీషాపులో ప్రముఖ కంపెనీకి చెందిన కేసు బీర్లను స్థానికులైన కొందరు యువకులు ఖరీ దు చేశారు. బ్రాందీషాపు ఎదురుగా ఉన్న చిన్నహోటల్‌లో కూర్చొని బీర్లు సేవిస్తుండగా అందులో ఒక సీసాలో అపరిశుభ్రంగా మురికినీళ్ళ మాదిరిగా బీరును గుర్తించారు. వెంటనే బ్రాందీషాపు వద్దకు వెళ్లి సదరు యువకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వివాదంతో బ్రాందీషాపు నిర్వాహకులు షాపును బంద్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మురళీధర్‌రాజ్ అక్కడికి చేరుకొని బీరు నాణ్యతలో అనుమానాలు ఉంటే సంబంధిత ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయాలని, యువకులను శాంతింపజేసి అక్కడి నుంచి పం పించారు. అనంతరం బ్రాందీషాపు యధావిధిగా తెరిచారు.

## దుండి అశోక్‌కు డాక్టరేట్



చిన్నగూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా గీసుగొండ ప్రభుత్వ మోడల్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న చిన్నగూడూరు మండలంలోని పగిడిపల్లికి చెందిన దుండి అశోక్‌కు ఉస్మానియా విశ్వ విద్యాలయం ఇంగ్లీష్ డిపార్టుమెంట్ దళిత సాహిత్యంలో డాక్టరేట్‌ను ప్రకటించింది. 'నరేటివ్స్ ఆఫ్ రెసిస్టెన్స్, ఎ స్టడీ అఫ్ ఐడియాలజీ అండ్ సోషల్ క్రిటిసిజం ఇన్ ధ సెలెక్ట్ షార్ట్ స్టోరీస్ అఫ్ గోగు శ్యామల అండ్ జూపాక సుభద్ర' అనే పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించినట్లు వైస్ ఛాన్సలర్ తెలిపారు. అశోక్ ఈ పరిశోధన ప్రొఫెసర్ బి.అశోక్ పర్యవేక్షణలో పూర్తి చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధ్యయనాలు

- ఈ నెల 8వ తేదీ నుంచి 20 వరకు సర్వేలు
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య




సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి, రాబోయే కాలంలో ప్రజాపోరాటాలను ఉధృతం చేయనున్నట్లు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శుక్రవారం సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని గునిగంటి రాజన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 8వ తేదీ నుంచి 20 వరకు సర్వేలు చేయనున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించేది ఒక్క ఎర్రజెండా మాత్రమేనని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీలిచ్చి, వాటి అమలులో విఫలమైందని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ మల్లన్నసాగర్ రైతులను అరెస్టు చేసి జైలుకు పంపితే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ పేరుతో లగచర్ల రైతులను భయభ్రాంతులకు గురి చేశారని విమర్శించారు. వామపక్ష పోరాట ఫలితంగా లగచర్లలో ఫార్మాసిటీని ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సూర్నపు సోమయ్య ఆకుల రాజు, శెట్టి వెంకన్న, అల్వాల వీరయ్య, కందూనూరి శ్రీనివాస్, కుంట ఉపేందర్, బానోత్ సీతారాంనాయక్ పాల్గొన్నారు.

## రేపటి నుంచి అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ తరగతులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించబడుతున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ తరగతులు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్నాయని ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులకు ప్రతీ ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయం త్రం 5.30 వరకు తరగతులు నిర్వస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు తప్పనిసరిగా తరగతులకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్: 73829 29705ను సంప్రదించాలన్నారు.

## వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | 2416 | 2080 |
| పల్లికాయ (సూక) | 5600 | 4000 |
| పల్లికాయ (పచ్చిది) | - | - |
| కందులు | - | - |
| పెసళ్లు | - | - |
| పత్తి | 6950 | 5800 |
| పసుపు (కాడి) | 11159 | 11000 |
| పసుపు (గోల) | 10868 | 10500 |
| తేజ మిర్చి | 12000 | 9000 |
| తేజ మిర్చి (కొత్తది) | 15021 | 12000 |
| తేజ ఏసీ | 15500 | 14000 |
| వండర్‌హాట్ ఏసీ | 13500 | 11000 |
| యూఎస్341ఏసీ | 14000 | 11000 |
| దేశీ ఏసీ | - | - |
| సింగిల్‌పట్టి ఏసీ | - | - |
| తాలు మిర్చి | 7000 | 3000 |

- వరంగల్ వ్యవసాయం

# వైకల్యాన్ని జయించిన పేద యువతి

- అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన జ్యోతి
- దేశం నుంచి ప్రాతినిథ్యం వహించి గోల్డ్‌మెడల్ కైవసం
- హర్షం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు



పారా ఒలింపిక్ ఆర్గనైజర్ ద్వారా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న జ్యోతి

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యానికి ఏదీ అడ్డు కాదని నిరూపించింది భూపాలపల్లి జిల్లాకు చెందిన ఓ నిరుపేద యువతి. అంతర్జాతీయ స్థాయిలో దేశం నుంచి ప్రాతినిధ్యం వహించి గోల్డ్‌మెడల్ సాధించింది. పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి ఈనెల 5న నేషనల్ పారాలింపిక్ అనే సంస్థ కాంబోడియా దేశంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ పారా త్రోబాల్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో కుటుంబసభ్యులతోపాటు గ్రామస్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఐదేళ్ల వయసులోనే రోడ్డు ప్రమాదంలో కుడికాలును కోల్పోయిన జ్యోతి.. కృతిమ కాలు సాయంతో నడుస్తోంది. ప్రస్తుతం హనుమకొండ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న ఆమె ఇంటర్‌లో ఉన్న సమయంలో హనుమకొండ జేఎన్ఎస్ మైదానంలో జరిగిన క్రీడా పోటీలను చూసి తానూ ఆడాలనే ఆసక్తిని పెంచుకుంది. నేషనల్ పారా ఒలింపిక్ సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ త్రోబాల్ పోటీల్లో పాల్గొని పసిడి పథకాలు సాధించి ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైంది. సెప్టెంబరు 22 నుంచి 26 వరకు అక్కడ జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి కాంబోడియా దేశంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈక్రమంలో పోటీల్లో పాల్గొనేందుకు కాంబోడియా వెళ్లేందుకు రూ.నలక్ష పైనే ఖర్చువుతుండటంతో మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో అధికారులు ఆర్థిక సహకారం అందించారు. దీంతో ఈనెల 5న కాంబో డియాలో జరిగిన పోటీల్లో పాల్గొని బంగారుపతకం సాధిచించింది. జ్యోతి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కాగా.. అంగవైకల్యాన్ని జయించి మెరిసిన జ్యోతిని గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అభినందిస్తున్నారు. జ్యోతికి పూర్తిస్థాయిలో శిక్షణనిస్తే ఒలింపిక్స్‌లోనూ పాల్గొని దేశానికి మంచి పేరు తీసుకొస్తుందని పలువురు అభి ప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థి దశ నుంచే అవినీతిని వ్యతిరేకించాలి : సీపీ

హనుమకొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే అవినీతిని వ్యతిరేకించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఈ నెల 3 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న అవినీతి వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమకొండ జూనియర్ కళాశాల నుంచి చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీని సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమన్నారు. ఈ ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్స్‌పెక్టర్ సట్ల రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తీరనున్న 'జనరల్' కష్టాలు

- పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా రెండు జనరల్ బోగీలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



డోర్నకల్ / మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడుస్తున్న పలు ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్‌లలో ప్రయాణించే సాధారణ ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. ఇప్పటి వరకు రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉండటంతో సీట్లు దొరక్క.. కనీసం నిలుచోవడానికి కూడా చోటు ఉండక ఎన్నో ఇబ్బందులు పడుతూ ప్రయాణిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆ సాధారణ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రస్తుతం ఉన్న రెండు జనరల్ బోగీలకు తోడు మరో రెండు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే శాఖ తాజాగా ప్రకటించింది. జనాభాకు అనుగుణంగా రైళ్లు లేకపోవడంతో రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా రైల్వే బోర్డు అధికారులు అప్పటి వరకు నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లలో సుమారు 50శాతానికి పైగా రద్దుచేశారు. అదే సమయంలో ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లలో ఉన్న జనరల్ బోగీల సంఖ్యను కూడా తగ్గించి, వాటి స్థానంలో రిజర్వేషన్, ఏసీ కోచ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో సాధారణ ప్రయాణికులు రైలు ప్రయాణమంటేనే హడలెత్తిపోయే పరిస్థితి వచ్చింది. ప్రతీ ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు గతంలో ఐదు జనరల్ బోగీలచొప్పున ఉండేవి. వాటిలో ఒక బోగీ మహిళలు, దివ్యాంగుల కోసం కేటాయించారు. ప్రస్తుతం అది కొనసాగుతోంది. ఇది మినహా మరో రెండు జనరల్ బోగీలే ఉండడంతో వాటిలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు లబోదిబోమన్నారు. ఈక్రమంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులు, పిల్లల బాధలు వర్ణనాతీతం. కొన్ని రైళ్లలో కనీసం కాలుపెట్టే స్థలం కూడా లేక వందల కిలోమీటర్ల దూరం నిలుచుని ప్రయాణిస్తున్న దృశ్యాలు కోకొల్లాలుగా ఉన్నాయి. అంతేకాదు డోర్లవద్ద కూర్చుని మరీ ప్రయాణిస్తున్నారు. ఇలాంటి దృశ్యాలు పలు ప్రసార, వార్తా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రముఖంగా రావడం, దానికి తోడు.. మంత్రులు, ప్రజా ప్రతినిధులకు రైళ్లలో సాధారణ బోగీలు పెంచాలనే డిమాండ్ ప్రజల నుంచి వినిపించాయి. కొన్నిచోట్ల సాధారణ బోగీలు పెంచాలని ఉద్యమాలు కూడా జరిగాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ప్రజల నుంచి వస్తున్న డిమాండ్లకు తలొగ్గిన రైల్వేశాఖ ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మరో రెండు అదనపు జనరల్ బోగీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిలో సికింద్రాబాద్, లింగంపల్లి, కాచిగూడ, గుంటూరు, నిజాముద్దీన్, తిరుపతి, కాకినాడ, దానాపూర్, మచిలీపట్నం, యశ్వంతపూర్, నాందేడ్, మధురై స్టేషన్ల మధ్య నడుస్తున్న ముఖ్యమైన రైళ్లకు ఈ జనరల్ బోగీలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే బోర్డు ప్రకటించింది. నూతనంగా లింక్ ఆఫ్‌మెన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) రకానికి చెందిన అదనపు బోగీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. ఎల్‌హెచ్‌బీ బోగీలలో ఒక్కో బోగీలో వందమంది ప్రయాణికులు సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. అంతేకాకుండా 180 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించేందుకు, ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రాణ నష్టం తక్కువగా ఉండేలా ప్రత్యేకమైన స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఈ ఎల్‌హెచ్‌బీ బోగీలను జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేశారు. అయితే ప్రస్తుతం 19 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా రెండు జనరల్ బోగీలు పెంచనున్నట్లు ప్రకటించగా త్వరలో మరో 21 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా రెండు సాధారణ బోగీలను పెంచుతామని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఇక దేశ వ్యాప్తంగా 370 రైళ్లలో దశల వారీగా జత చేయనున్నారు.

### సాధారణ ప్రయాణికుల కష్టాలు తీరుతాయి

డాక్టర్ పరికిపండ్ల అశోక్, రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్, మానుకోట



ఎక్స్‌ప్రెస్‌లో సాధారణ ప్రయాణికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలని మానుకోట నుంచి ప్రధానికి కోటి ఉత్తరాల ఉద్యమానికి శ్రీకారం చుట్టాం. మొత్తం ఆరు రాష్ట్రాల్లో పర్యటించి, సమస్యను వివరించాం. జనరల్ బోగీలు ఎక్కువగా లేక పోవడంతో రైలుఎక్కే సమయంలో జారి కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రయాణికుల కష్టాలను తెలుసుకున్న రైల్వేశాఖ పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రస్తుతం ఉన్న రెండు సాధారణ బోగీలకు అదనంగా మరోరెండు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్ణయం తీసుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చింది.

### ఉద్యమానికి నాందిపలికిన మానుకోట

**పరికిపండ్ల అశోక్ నేతృత్వంలో ప్రధానికి కోటి ఉత్తరాలు**

నిత్యం జనరల్ బోగీల్లో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని, ప్రతీ రైలులో ఐదు అదనపు బోగీలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ప్రధానికి కోటి ఉత్తరాల ఉద్యమానికి మానుకోట నాంది పలికింది. ఈ ప్రాంతానికే పరిమితం కాకుండా ఇది దేశ వ్యాప్తమైంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ 2024 మార్చి 8న వరంగల్ వెళ్లేందుకు స్థానిక రైల్వే స్టేషన్‌కువచ్చారు. ఆ సమయంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రెండు సాధారణ బోగీలు మాత్రమే ఉండడంతో జిల్లాకు చెందిన ఓ గర్భిణి చంకలో తన చిన్నపాపతో రైలు ఎక్కేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండి ఆమె కింద పడిపోగా ఆమె చంకలో ఉన్న పాప తలకు దెబ్బతగిలింది. ఆరు రోజుల పాటు చికిత్స అందించినా ఆ చిన్నారి కన్నుమూసింది. దీంతో చలించి పోయిన పరికిపండ్ల అశోక్ ప్రతీ రైలులో జనరల్ బోగీల సంఖ్యను పెంచి, ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలంటూ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ప్రధానికి కోటి ఉత్తరాల పేరుతో ప్రారంభించిన ఈ ఉద్యమం అతి తక్కువ సమయంలో తెలుగురాష్ట్రాలతో పాటు గుజరాత్, కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో విస్తృతమైంది. రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్‌గా ఆయన ఆయా రాష్ట్రాల్లో పర్యటించి ఉద్యమాన్ని నడిపించారు.


వరంగల్ హెడ్‌పోస్టాఫీసు వద్ద ఉత్తరాలను పోస్టుబాక్సులో వేస్తున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్ (ఫైల్)

పలు ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న వివిధ రాష్ట్రాల ప్రజలు ఈ పోరాటానికి స్వచ్ఛందంగా మద్దతు పలుకుతూ ప్రధానికి ఉత్తరాలు రాశారు. ఇలా దాదాపుగా 30లక్షలకు పైగా లేఖలు రాశారు. ఇదే క్రమంలో రైళ్లలో సాధారణ ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెస్తూ మీడియా చానళ్లు, వర్తాపత్రికలు కథనాలు ఇచ్చాయి. మరోపక్క ప్రజా ప్రతినిధులపై కూడా ప్రజలు ఒత్తిడి తెచ్చారు. ఈ పరిణామాలను గమనించిన రైల్వేశాఖ రైళ్లలో అదనంగా రెండు సాధారణ బోగీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించి ప్రయాణికులకు తీపి కబురు అందించింది.

### ఏయే రైళ్లకు అదనపు బోగీలంటే..

సికింద్రాబాద్ - గుంటూరు - సికింద్రాబాద్ మధ్య నడిచే రైలు నెంబర్ 12706/12705 ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-నిజాముద్దీన్-హైదరాబాద్ 12721/12722 దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిరిపూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్.. 12757/12758 కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ -దానాపూర్-సికింద్రాబాద్ 12791/12792 ఎక్స్‌ప్రెస్, మచిలిపట్నం-ధర్మవరం-మచిలిపట్నం 17215/17216 ధర్మావరం ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కొల్లం-తిరుపతి 17421/17422 తిరుపతి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-హౌరా-సికింద్రాబాద్.. ఫలక్‌నామా 12704/12703 ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గూడూరు-సికింద్రాబాద్ 12715/12716 సాచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్, కాకినాడ-లింగంపల్లి-కాకినాడ 12737/12738 గౌతమి ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి-ముంబాయి సీఎస్ఎంటీ-లింగంపల్లి 17058/17057 దేవగిరి ఎక్స్‌ప్రెస్, కాకినాడ-సాయినగర్ షిర్డీ-కాకినాడ 17206/ 17205 షిర్డీ ఎక్స్‌ప్రెస్, కాకినాడ-భౌనగర్-కాకినాడ 12755/12756 ఎక్స్‌ప్రెస్, మచిలిపట్నం-యశ్వంతపూర్-మచిలిపట్నం 17211/17212 ఎక్స్‌ప్రెస్, తిరుపతి-లింగంపల్లి-తిరుపతి 12733/12734 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, కాచిగూడ-మంగళూరు-కాచిగూడ 12789/12790 ముర్డేశ్వర ఎక్స్‌ప్రెస్, కాచిగూడ-మధురై-కాచిగూడ 22715/22716 సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-సికింద్రాబాద్-తిరుపతి 12797/12798 వెంకటాద్రిఎక్స్‌ప్రెస్, నాందేడ్-నిజాముద్దీన్-నాందేడ్ 12753/12754 మరట్వాడ ఎక్స్‌ప్రెస్, నాందేడ్-అంబఅందవురా-నాందేడ్ 22709/22710 హజూర్‌సాహెబ్ నాందేడ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రెండు అదనపు జనరల్ బోగీలను ఏర్పాటు చేయనున్నారు.

# శరవణ భవ.. శరవణ భవ..


ఊకల్‌లోని నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం

- నేడు శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాలు
- వేడుకలకు ముస్తాబైన ఊకల్ దేవాలయం
- పలు దేవాలయాల్లో అభిషేకాలు, కల్యాణాలు, అన్నదానాలు

గీసుగొండ/వరంగల్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వల్లీ వల్లభ మాంపాయి సేనా నాయక మాంపాంయి.. శరవణ భవ దేవతల సైన్యాధ్యక్షుడు కృత్తిక పుత్రుడు శణ్ముఖ దేవుడు, శివపార్వతుల తనయుడు కార్తీకేయుడు. మార్గశిర మాసం శష్ఠి శనివారం రోజున శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

గీసుగొండ మండలంలోని ప్రసిద్ధి చెందిన ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్టి సందర్భంగా శనివారం స్వామి వారి కల్యాణోత్సవానికి సర్వం సిద్ధమైంది. కల్యాణోత్సవ వేడుకలకు ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఏటా జరిగే ఈ ఉత్సవానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తిలకిస్తారు. కాగా, స్వయంభూగా వెలిసిన నాగేంద్రుడు ఈ ఆలయంలో కొలువుదీరి ఉండడం ఈ ఆలయానికి ప్రత్యేకత. స్వామి వల్లీదేవి, దేవసేనాదేవిల కల్యాణాన్ని తిలకించినవారికి, చేయించిన వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలతో పాటు ఆర్థిక ఈతి బాధలు, సకల దోషాలు తొలిగిపోతాయని భక్తులకు అపార నమ్మకం. రాహు, కేతువు, అంగారక గ్రహాలకు సుబ్రహ్మణ్యేశ్వరుడు అధిపతిగా ఉంటాడు కాబట్టి మూడు గ్రహాల దోషాలను స్వామివారు తొలగిస్తారని ఆలయ అర్చకుడు సుదర్శనాచార్యులు తెలిపారు.

**ఘట్టం ఇలా..**

శనివారం ఉదయం 9 గంటలకు స్వామి వారికి ఎదుర్కోళ్లు, గ్రామసందర్శన, ఆలయప్రవేశం చేయించి మంగళవాయిద్యాలతో కల్యాణ మండపానికి తీసుకువస్తారు. 11 గంటలకు కల్యాణం, తలంబ్రాల ఘట్టం కనుల పండువగా జరుగుతుంది. అనంతరం ఉత్సవమూర్తులైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వల్లీదేవి, దేవసేనాదేవిలకు పుష్పమాల సేవ, ఊయలసేవ అనంతరం పారువేట క్రతువులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మాచిన పెల్లి బాబురావు తెలిపారు.


ప్రత్యేక పూల అలంకరణలో ఉత్సవమూర్తులు

### కల్యాణోత్సవం తిలకిస్తే అంతా శుభమే..

**ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు**



స్వయంభువుగా వెలిసిన ఊకల్ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా నిర్వహించే బ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించే భక్తులకు అంతా శుభం జరుగుతుంది. శనివారం 12.10 గంటలకు స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుంది. సౌభాగ్యం, సంతానభాగ్యం కలిగి, గ్రహదోషాలు, దృష్టిదోషాలు, రుణబాధలు తొలగిపోయి ఇష్టసిద్ధి లభిస్తుంది. స్వామివారి కల్యాణానికి వచ్చి కొబ్బరికాయ కొట్టి ఇంటి ముందు కట్టుకుంటే సకల దోషాలు నివారించబడుతాయి. ఎంతో మహామాన్వితం గల స్వామి తలంబ్రాలు భక్తులకు అందించబడుతాయి.

**నగరంలో..**

చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణమహోత్సవాన్ని వందలాది మంది దంపతులతో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భద్రకాళి దేవాలయంలో జరిగే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.516 టికెట్ చెల్లించాలని ఆలయ ఈవో శేషుభారతి తెలిపారు. ఎంజీఎం సెంటర్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకం అనంతరం వెయ్యి అరటి పండ్లతో సహస్రనామార్చన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎల్లంబజార్‌లోని శ్రీనాగేంద్రస్వామి దేవాలయం, బట్టలబజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాల యంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీవాసవీ మాత దేవాలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఉర్సు నాగేంద్ర స్వామి దేవాలయంతో పాటు నగరంలోని అనేక దేవాలయాల్లో సుబ్రహ్మణ్య శష్ఠి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా, నగరంలో అన్నదానాలు, ప్రసాద వితరణలు, ప్రత్యేక అభిషేకాలు, భజనలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

# ఏడాదిలో.. ఎన్నో అడుగులు!

(5వ పేజీ తరువాయి)

రూ.176కోట్లతో ఎడ్యుకేషన్ హబ్‌కు శంకుస్థాపన చేసింది. రూ.286కోట్లతో భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తి చేసిందుకు అడుగులు ముందుకు వేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు ఎదురుచూస్తున్న దేవాదుల ప్రాజెక్టును మార్చి 2026నాటికి పూర్తిచేసేలా రూ.689 కోట్లు విడుదల చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటితో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో దక్షిణ కొరియా నుంచి పెట్టుబడులు ఆహ్వానించటమే కాకుండా.. భూ నిర్వాసితులకు అండగా నిలిచింది. ములుగులో గిరిజన యూనివర్సిటీకి 211ఎకరాల భూమిని కేటాయించింది. ఇలా అనేక అభివృద్ధి పనులతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం పొందేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అలాగే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతోపాటు రూ.500 సబ్సిడీపై గ్యాస్ పంపిణీ, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తో వేలాది మందికి లబ్ధి చేకూరుతోంది.

**మెగా టెక్స్‌టైల్ పార్కుపై ప్రత్యేక దృష్టి**

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును 1,350ఎకరాల విస్తరణలో గత ప్రభుత్వం నిర్మాణం చేసింది. రూ.567కోట్లతో టెక్స్‌టైల్ పార్కులో టీఎస్ఐఐ ద్వారా రహదారులు, ఇతర మౌళిక వసతులు కల్పించారు. అయితే వరంగల్‌కు మరో వస్త్రనగరిగా అభివృద్ధి జరుగుతుందని భావించినా ఆశించిన స్థాయిలో పెట్టుబడులు రాలేదు. కేవలం కైటెక్స్, గణేషా ఎకోపెట్, ఎకోటెక్, కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీలు మాత్రమే పరిశ్రమలు స్థాపించాయి. అయితే వీటిలో స్థానికులకు పెద్దగా ఉపాధి అవకాశాలు రాలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కును సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. మొదటి భూ నిర్వాసితులకు ఇంటి స్థలాలను కేటాయించారు. ఇటీవల 836మందికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున మంజూరు చేశారు. తాజాగా ఆదివారం మెగా టెక్స్‌టైల్ పార్కులో అభివృద్ధి పనులకు రూ.160.99కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో పాటు ఆగస్టు 12వ తేదీన దక్షిణ కొరియాలో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కులో పెట్టుబడులకు అక్కడి కంపెనీలతో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. దీంతో త్వరలోనే భారీగా పెట్టుబడులు రానుండగా ఉపాధి అవకా శాలుపెరగనున్నాయి.

**52 ఏళ్లకు కొత్త మాస్టర్ ప్లాన్ అమల్లోకి..**

వరంగల్ నగరాభివృద్ధిలో కీలకమైన మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయడానికి 52ఏళ్లు పట్టింది. 1972లో తయారు చేసిన మాస్టర్ ప్లాన్ మాత్రమే ఇప్పటికి అమల్లో ఉంది. ప్రతి 20ఏళ్లకు ఒకసారి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంతో వరంగల్ మాస్టర్ ప్లాన్ అమల్లోకి రాకుండా పోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2041 మాస్టర్ ప్లాన్ తయారు చేసినప్పటికి 2016నుంచి ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా విస్తరణతో పాటు 2041 మాస్టర్‌ప్లాన్‌కు కొంత మార్పులు చేర్పులు చేసి ప్రభుత్వం ఆమోదించింది. దీంతో వరంగల్‌కు 52ఏళ్ల తరువాత కొత్త మాస్టర్ ప్లాన్‌ను అమల్లోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుంది.


**ఏడాదిలో అభివృద్ధికి నిధులొచ్చాయిలా..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు పెండింగ్ పనులకు మోక్షం కలిగించేలా నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రై సిటీల అభివృద్ధికి పెద్దపీట వేసింది. ఎయిర్‌పోర్టు భూసేకరణ, టెక్స్‌టైల్‌పార్కు, భూపాలపల్లి మైలారం గుట్టల్లో ఎడ్యుకేషన్ హబ్, చిన్నకాళేశ్వరం పనులు, దేవాదుల పూర్తి ఇలా పనులకు నిధులిచ్చింది. ఇక మహానగరం అభివృద్ధికి ఎన్నడూ లేని విధంగా రూ.4962.47కోట్లు కేటాయించింది. వీటిలో కొన్ని పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది.

- భూపాలపల్లిలో 40ఎకరాల్లో రూ.176కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు శంకుస్థాపన
- గణపురం మండలం మైలారం గుట్టల్లో 60ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్కుకు శంకుస్థాపన
- చిన్నకాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.286కోట్లు కేటాయింపులు
- ములుగు గిరిజన యూనివర్సిటీకి సుమారు రూ.10కోట్ల విలువైన 211ఎకరాల భూమి కేటాయింపు
- వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ : రూ.4,170 కోట్లు
- మామునూరు ఎయిర్ పోర్ట్ భూసేకరణ: రూ.205కోట్లు
- కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ : 160.92 కోట్లు
- టెక్స్ టైల్ పార్కులో రోడ్లు, స్కూల్స్, సదుపాయాలు : రూ.33.60 కోట్లు
- టెక్స్ టైల్‌పార్క్ నిర్వాసిత రైతులకు ఇందిరమ్మ ఇళ్లు : రూ. 43.15 కోట్లు
- కాళోజీ కళాక్షేత్రం : రూ.85 కోట్లు
- పరకాల నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు రోడ్డు విస్తరణ : రూ. 65 కోట్లు
- నయీమ్ నగర్ బ్రిడ్జి నిర్మాణం: రూ.8.30కోట్లు
- వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ బిల్డింగ్‌కు : రూ. 32.50 కోట్లు
- ఇన్నర్ రింగ్ రోడ్: రూ.107కోట్లు
- భద్రకాళి ఆలయం వద్ద పాలిటెక్నిక్ కాలేజీ కొత్త భవనానికి రూ.28కోట్లు
- గ్రేటర్ వరంగల్ పరిధిలో రోడ్లు : రూ. 49.50
- వరంగల్ ఉర్దూ భవన్, షాదీ ఖానాకు : 1.50 కోట్లు

# భద్రత లేని బ్యాంకులే లక్ష్యంగా..

- రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకు చోరీ కేసులో ముగ్గురి అరెస్టు
- 2కిలోల 520 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా


నిందితుల అరెస్టు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

హనుమకొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో భద్రత, రక్షణ లేని బ్యాంకులే లక్ష్యంగా దొంగలు చోరీలకు ఎంచుకుంటున్నారని, ఈక్రమంలోనే వరంగల్ జిల్లా రాయపర్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో దోపిడీ జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా తెలిపారు. ఈ మేరకు రాయపర్తి ఎస్బీఐలో చోరీకి పాల్పడిన ముఠాలోని సభ్యుల్లోని ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, కోటి ఎనభై లక్షల నాలుగు వేల రూపాయల విలువ గల 2కిలోల 520 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు, పదివేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దోపిడీకి సంబంధించిన ఆయన వివరాలు వెల్లడించారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ నవాబ్ హసన్(39) ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ వాసులు అర్షాద్ అన్సారీ(34), షాకీర్‌ఖాన్ అలియాస్ బోలె ఖాన్ (28), హిమాన్షు బిగాం చంద్ జాన్వర్(30), సాజీద్ ఖాన్(35), మహారాష్ట్రకు చెందిన అక్షయ్ గజానన్ అంబోర్(24), సాగర్ భాస్కర్ గోర్(32)లు ఏడుగురు ముఠాగా ఏర్పడి వ్యాపారం ముసుగులో హైదరాబాద్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఈ ముఠా బ్యాంకుల్లో సొమ్మును చోరీ చేసేందుకు గూగుల్ ద్వారా మారుమూల ప్రాంతాల్లోని బ్యాంకుల సమాచారం సేకరించారు. అందులో భాగంగా వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకును చోరీ చేయాలని అనుకున్నారు. ఈ మేరకు గత నెల 18న నిందితుల్లో ఒకరైన హిమాన్షు డ్రైవింగ్ చేస్తుండగా మరో ఆరుగురు నిందితులు కారులో రాయపర్తి గ్రామశివారుకు చేరుకున్నారు. హిమాన్షును తెల్లవారుజామున 4 గంటలకు రమ్మని చెప్పి పంట పొలాల ద్వారా ఆరుగురు నిందితులు బ్యాంకుకు రాత్రి 11గంటలకు చేరుకొని ముందుగా కిటికీని తొలిగించారు. ఆపై బ్యాంకు సెక్యూరిటీ అలారంతో పాటు సీసీ కెమెరాల వైర్లను తొలిగించారు. తర్వాత ఇద్దరు నిందితులు తొలగించిన కిటీకిల దగ్గర కాపలా ఉండగా, మిగతా నలుగురు నిందితులు స్ట్రాంగ్ రూమ్ తాళాలు పగలగొట్టి వాటిలో ఉన్న మూడు లాకర్లను తమ వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్లు వినియోగించి తెరిచారు. అందులో ఉన్న సుమారు రూ.13 కోట్ల 61 లక్షల విలువగల బంగారు ఆభరణాలను వారి వెంట తెచ్చుకున్న సంచుల్లో వేసుకున్నారు. గ్యాస్ సిలిండర్, ఇతర సామగ్రిని బ్యాంకులోనే వదిలేసి సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్‌ను తీసుకొని వచ్చిన కారులోనే హైదరాబాద్‌లోని అద్దె ఇంటికి వెళ్లారు. ఈ మేరకు చోరీ చేసిన సొత్తును ఏడు వాటాలుగా పంచుకొని నవంబరు 19న మూడు బృందాలుగా విడిపోయి ఉత్తప్రదేశ్, మహారాష్ట్రకు వెళ్లిపోయారు.

కాగా, బ్యాంకులో జరిగిన చోరీపై అప్రమత్తమైన వరంగల్ కమిషనరేట్ పోలీసులు.. వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ నేతృత్వంలో వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య ఇన్విస్టిగేషన్ ఆఫీసర్‌గా, నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, సీసీఎస్ ఏసీపీ భోజరాజు ఆధ్వర్యంలో 10కి పైగా పోలీసు బృందాలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో వెతికారు. టెక్నాలజీని వినియోగించుకొని నిందితుల కదలికలను గుర్తించారు. ఆపై ఈ ముఠాలోని ఆర్షాద్ అన్సారీ, షాకీర్‌ఖాన్, హిమాన్షును అరెస్టు చేశారు. అతి తక్కువ కాలంలో చోరీ కేసును ఛేదించి, సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీలు కిరణ్‌కుమార్, నర్సయ్య, భోజరాజు, సీఐలు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, బాలాజీ వరప్రసాద్, శివకుమార్, రఘుపతిరెడ్డి, శ్రీనివాసరావు, మహేందర్‌రెడ్డి, అబ్బయ్య, పవన్‌కుమార్, విశ్వేశ్వర్, ఏఏఓ సల్మాన్‌పాషా, ఎస్సైలను సీపీ అంబర్ కిషోర్‌ఝా అభినందించారు. కాగా, పరారీలో ఉన్న నలుగురు నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని, తొందర్లోనే పట్టుకుంటామని సీపీ పేర్కొన్నారు.

**బ్యాంకుల్లో భద్రత ఏర్పాట్లు చేసుకోవాలి..**

వరంగల్ కమిషనరేట్ పరిధిలోని బ్యాంకుల్లో భద్రతా ఏర్పాట్లు సరి చూసుకోవాలని సీపీ అంబర్ కిషోర్ ఝా కోరారు. దొంగలు భద్రత లేని బ్యాంకులను ఎంచుకుంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని గార్డు లేని బ్యాంకుల్లో చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. రాయపర్తి ఎస్బీఐలో అలారమ్ సైతం పాత టెక్నాలజీ వినియోగించడంతో నిందితులు చోరీ సులువుగా చేశారన్నారు. అలారమ్ కట్‌చేయగానే బ్యాంకు అధికారులకు, పోలీస్‌శాఖకు ఎస్ఎంఎస్ వచ్చేలా అన్ని బ్యాంకులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇప్పటికే కమిషరేట్ పరిధిలోని బ్యాంకులను పోలీసులు సందర్శించి సూచనలు చేశారన్నారు. 24 గంటలు సెక్యూరిటీ గార్డులు, బ్యాంకుల్లో సరిపడా సిబ్బంది ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సూచించారు.

# బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి



భూపాలపల్లిలో అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న వెంకటరాణి



గోవిందరావుపేటలో నివాళులర్పిస్తున్న నేతలు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని భూపాలపల్లి మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, అధికారులు హాజరయ్యారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కౌన్సిలర్లు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

• టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంవేద్కర్ వర్ధంతిలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్సై ప్రసాద్ హాజరయ్యారు. అంబేద్కర్ యువజన సంఘం జిల్లా, మండల నాయకులు, ఎమ్మార్పీఎస్, టీఎస్ ఎమ్మార్పీస్ జిల్లా మండల నాయకులు, వివిధ శాఖల అధికారులు, వివిధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి): మంగపేటలోని తెలంగాణ సెంటర్, కమలాపురంలో అంబేద్కర్ సెంటర్, తిమ్మంపేట, రాజుపేట, అకినేపల్లి-మల్లారంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మంగపేటలో గల కస్తూర్బా అనాథాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో అంబేద్కర్ యువజన సంఘం మండల ఇన్‌చార్జి అధ్యక్షుడు బసారి హరికృష్ణ, మాజీ ఎంపీపీ పచ్చ శేషగిరిరావు, బీఆర్ఎస్ మహిళా విభాగం మాజీ మండల అధ్యక్షురాలు కాటూరి సుగుణ, ఆత్మ మాజీ చైర్మన్ పి. వెంకటేశ్వర్లు, సంఘం జిల్లా సీనియర్ నాయకులు యెంపెల్లి వీరస్వామి, పి. యాదగిరి, జి. రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

• గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రా గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడి, ములుగు జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎనగందుల మొగిలి, వివిధ సంఘాల నాయకులు దేపాక కృష్ణ, పంగ శ్రీను, శ్రీనివాస్, ప్రవీణ్, సాంబయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

• చిట్యాల (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ వర్ధంతి మండల కేంద్రంలో జరిగింది. అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు పుల్ల మల్లయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, గడ్డం కొమరయ్య, బొట్ల ఆనందం, రత్నాకర్‌రెడ్డి, లక్ష్మణ్, కిరణ్, తిరుపతి, సురేష్ పాల్గొన్నారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతిని విద్యాశాఖ అధికారులు నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటం వద్ద ఎంఈవో వెంకటేశ్వర్లు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

• మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ కుల సంఘ పార్టీల అధికారుల అందరి సమక్షంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతిని శుక్రవరం ఘనంగా నిర్వహించారు. నల్లబుగ ధర్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తోడిచెర్ల దుర్గయ్య, మాదిగ యువసేన మండల అధ్యక్షులు మంథని రవితేజ, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి లింగాల నిఖిల్, దళిత సంఘం నాయకులు మెరుగు సమ్మయ్య, రేవల్లి శేఖర్, బీఆర్ఎస్ నాయకులు ఆన్కారి ప్రకాష్, పెండ్యాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహిం చారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయ కులు, ప్రజాసంఘాల నాయకులు క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మండల అధ్యక్షుడు మహేష్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, ప్రజా సంఘాల, పార్టీల నాయకులు మధు, చిరంజీవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

• మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి జరిగింది. అంబేద్కర్ విగ్రహానికి పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్, యువజన సంఘం జిల్లా నాయకులు నిమ్మల భద్రయ్య, దొమ్మేటి ఓదెలు, బండారి రామస్వామి, అంతడుపుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

• మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండల అధ్యక్షుడు కేసారపు నరేష్, తాండ్ర దినేష్, ఖమ్మంపల్లి సందీప్, రాజయ్య సమ్మయ్య, ప్రతాప్, మల్లేష్, రాకేష్, రంజిత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ రీల్

### వీధి కుక్కల దాడి.. ఇద్దరికి గాయాలు

కాటారం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిదినేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బొప్పారంలో శుక్రవారం వీధి కుక్కలు చేసిన దాడిలో ఇద్దరు గాయపడ్డారు. మంథెన లాస్యశ్రీ అనే చిన్నారికి తీవ్రగాయాలు కాగా మల్లమ్మ అనే వృద్ధురాలికి గాయాలయ్యాయి. మంథెన శేఖర్ కూతురు చిన్నారి లాస్యశ్రీ పాఠశాలకు వెళ్తుండగా కుక్కలు దాడి చేయడంతో కిందపడింది. దీంతో కుక్కలు కరవడంతో తలపై గాయాలయ్యాయి. దీంతో చిన్నారిని అంబులెన్స్‌లో భూపాలపపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. లాస్యశ్రీ క్షేమంగానే ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

### గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మొగుళ్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కిశాల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఇంగ్లిష్ గెస్ట్ టీచర్‌గా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు సంబంధిత సబ్జెక్టులు బోధించడానికి డిగ్రీ, బీఎడ్, టెట్ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 7నుంచి 10లోగా రెండుసెట్ల దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు అందించాలని సూచించారు.

### 10న రామప్ప తైబందీపై సమావేశం

వెంకటాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి పాలంపేట గ్రామంలోని రామప్ప సరస్సు కింద రబీ పంట సాగుచేసుకునేందుకు ఈనెల 10న తైబందీ సమావేశం నిర్వహించనున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ రవీందర్‌రెడ్డి, ఏఈ జయంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలంపేట గ్రామంలోని రైతువేదికలో తహసీల్దార్ సదానందం అధ్యక్షతన ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి ఆయకట్టు రైతులు హాజరుకావాలని వారు కోరారు.

### ఆరోగ్య కేంద్రాల సందర్శన

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో గల మల్లంపల్లి, పందికుంట గ్రామాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ కేంద్రాలను డీఎంహెచ్‌వో గోపాల్‌రావు శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమందిర్ కేంద్రాల్లో చిన్నారులకు సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని జాతీయ కార్యక్రమాల్లో లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సామ్, మామ్ పిల్లల గురించి ఆరా తీసి బాలామృతం వంటి పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట పోషకాహార ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్, రాయినిగూడెం పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

### బాల్య వివాహాలపై అవగాహన

కన్నాయిగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముప్పనపల్లి జడ్పీ పాఠశాల, కేజీబీవీ విద్యార్థులకు బాల్య వివాహాలపై అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నరేశ్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ సహకరించా లన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్ వైజర్ సుదర్శన్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పూర్ణచందర్, అరుణ, నాగరాజు, మేఘన, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రం పరిశీలన

మల్హర్, డిసెంబర్(ఆంధ్రజ్యోతి) 6 : మండలంలోని కొయ్యూర్ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం డీసీవో కార్యాలయ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రిలీఫ్‌రెడ్డి, చైర్మన్ ఇప్ప మొండయ్య పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన కొనుగోల్లు చేపట్టాలని అధికారులు, సెంటర్ నిర్వాహకులకు సూచించారు.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

చిట్యాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్‌లో ఉన్న రికార్డులను పరిశీలించి చిన్నారులతో కలిసి భోజనం చేశారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, ఆయా పద్మ పాల్గొన్నారు.

### వరికోత మిషన్ దగ్ధం

మల్హర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు వరికోత మిషన్ దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారం గ్రామ శివారులో చైన్ వరికోత మిషన్ పోలాలు కోయడానికి వెళ్తున్న సమయంలో షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటల చెలరే గాయి. చూస్తుండగానే మిషన్ కాలిపోయింది. మంథని నుంచి ఫైర్ ఇంజన్ వచ్చే సరికి పూర్తిగా దగ్ధమైంది. ఈ మిషన్ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన వ్యక్తిదిగా తెలుస్తోంది.

## శిక్షణ తరగతులను యువత సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు సాధించడానికి కావాల్సిన నైపుణ్యాలను పెంచుకోవడానికి తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులను జిల్లాలోని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టాస్క్ నాణ్యమైన మానవ వనరులు, సేవలు, ప్రభుత్వం, అకాడెమియాల మధ్య సమన్వయాన్ని తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన లాభాపేక్ష లేని సంస్థ అని తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క చొరవతో జిల్లాలో ఈనెలలో స్కిల్ సెంటర్‌ను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు దిగ్గజ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి అవసరైన నైపుణ్యాలు, ఆంగ్లంలో మాట్లాడడం, ఇంటర్వ్యూలు ఎదుర్కొనేలా, ఆత్మవిశ్వాసం, వ్యక్తిగత సామర్థ్యాలు పెంచడం, బృందాలు నడిపించగల టాస్క్ శిక్షణ కేంద్రాల ద్వారా టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన యువత ఈనెల 15లోగా ములుగులోని జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 8886220324, 9440348961 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

### వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలి : డీఈవో

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని డీఈవో ముద్దమల్ల రాజేందర్ సూచించారు. పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ కన్వీనర్లు, కోకన్వీనర్లు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని అన్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో పట్టణంలోని శాంతినికేతన్ (పాత గుడ్‌మార్నింగ్ స్కూల్)లో ఈ ప్రదర్శనను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారని అన్నారు. ఈ సమావేశంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి కాగితపు లక్ష్మణ్, జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి, రాజగోపాల్, మండల రవీందర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ రాజేష్, శనిగరపు భద్రయ్య, వివిధ మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

### అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపిక



ఇర్ప బాలాజీ

వాజేడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మడిదొడ్డికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇర్ప బాలాజీ అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 8న ఢిల్లీలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. రాజ్యాంగ హక్కు కోసం, బలహీనవర్గాల కోసం పోరాడిన, ఉచిత సేవలకు ప్రతి సంవత్సరం ఎస్సీఎస్టీ నాయకులకు ఈ అవార్డు ప్రదానం చేస్తుంటారు. ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకుడిగా, జిల్లా ఉత్తమ ఉపాధ్యా యుడిగా. కరాటే శిక్షుడిగా బాలాజీ విశేష గుర్తింపు పొందగా ఆయన ఈ అవార్డును అందించనున్నారు. ఆయన ఏటూరునాగారం మండలంలోని రోహీర్ ఎంపీయూపీఎస్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు.

### పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం

వెంకటాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సిద్ధమవుతున్నామని ఎండీపీడీవో రాజు తెలిపారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో ఈ మేరకు పేర్కొన్నారు. ప్రభుత్వం ఎప్పుడు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ఎలాంటి ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే వార్డులవారీగా ఫొటోలతో కూడిన ఓటరు జాబితా రూపొందించామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన బ్యాలెట్ బాక్సులను సిద్ధంచేసే పనిలో నిమగ్నమైనట్లు తెలిపారు.

### బీజేపీ అనుబంధ సంఘాల నిరసన ప్రదర్శన



మాట్లాడుతున్న నాయకులు

మంగపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ, దాని అనుబంధం సంఘాల ఆధ్వర్యంలో మం డల కేంద్రంలో శుక్రవారం నిరసన ర్యాలీని నిర్వహించారు. కమలాపురం నుంచి 25 గ్రామ పంచాయతీల మీదుగా బైక్‌పై ప్రదర్శన జరిగింది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఈ సందర్భంగా నాయకులు విమర్శించారు. మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించిచిన ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు లింగంపల్లి శ్రీనివాసరావు, యెర్రంకారి వీరన్ కుమార్, రావుల జానకీరావు, చెట్టుపల్లి స్నేహకు మార్‌తోపాటు మండల, గ్రామాల నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### శీతాకాల వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

వాజేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో వచ్చే వ్యాధులపై మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులకు వాజేడు పీహెచ్‌సీ వైద్యాధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. చలికాలంలో తరుచుగా వచ్చే జలుబు, దగ్గు తదితర వ్యాధులు, వాటి పట్ల పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలాచూడాలని వార్డెన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మహేందర్, హెచ్ఎస్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

### ఆర్మ్‌డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ శ్రీనివాస్




మాట్లాడుతున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏఎస్పీ శ్రీనివాస్

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసులతో సమానంగా హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారని, వారి సేవలు ఎంతో ప్రశంసనీయమని ఆర్మ్‌డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్ అన్నారు. హోంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో హోంగార్డులు అంకితభావంతో సేవలందిస్తున్నారని కొనియాడారు. నిత్యం క్రమ శిక్షణతో మెలుగుతూ పోలీసుశాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నగేష్, రత్నం, ఆర్ఎస్సై సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### వాజేడు ఎస్సై బాధ్యతలు ఎవరికి?

వాజేడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆత్మహత్య రాష్ట్రంలో కలకలం రేపింది. ఆయన రివాల్వర్‌తో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడిన అనంతరం ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంతో ఆ స్థానంలో ఎవరొస్తారని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది జూన్ 17న వాజేడు ఎస్సైగా హరీశ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో పీఎస్ పరిధిలోని ఓ గ్రా మంలో మావోయిస్టులు సమావేశమై తమ ఉనికిని చాటుకు న్నారు. అనంతరం గత నెల 21న వాజేడు పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో పోలీస్ ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు గిరిజనులను మావోయిస్టులు హతమార్చి పోలీసులకు సవాల్ విసిరారు. ఈ క్రమంలో ఏటూరునాగారం మండలంలోని చల్పాక అటవీ ప్రాం తంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం కలకలం సృష్టించింది. డిసెంబరు 2న వాజేడు ఎస్సై హరీశ్ ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన మృతి పోలీసు శాఖకు తీరని లోటుగా మారింది. ఈ క్రమంలో వాజేడు ఎస్సైగా ఎవరొ స్తారనే చర్చ మొదలైంది. ప్రస్తుతం ఈ పోలీస్‌స్టేషన్‌కు వచ్చేం దుకు చాలా మంది ఎస్సైలు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. అయితే.. వరుస సంఘటనలతో వాజేడు స్టేషన్ వార్తల్లోకి ఎక్కు తున్న నేపథ్యంలో ఎస్సైగా బాధ్యతలు స్వీకరిం చాలంటే సీనియర్ అధికారి అయితేనే బాగుంటుందనే చర్చ కూడా సాగుతోంది. గతంలో పట్టుబట్టి మరి వాజేడు స్టేషన్ ఎస్సైగా పోస్టింగ్ పొందేందుకు చాలా మంది ఎస్సైలు ఉత్సాహం చూపించేవారు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన వరుస పరిణామాల నేపథ్యంలో ఎస్సైగా ఎవరు బాధ్యతలు తీసుకుంటారనే చర్చ సాగుతోంది. ఈ స్టేషన్‌కు ఇంకా ఇన్‌చార్జి ఎస్సైగా కూడా ఎవరికీ కూడా బాధ్యతలు అప్పగించలేదు.

### యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో యోగాసనాలు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్, ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ములుగు మండలంలోని బండారుపల్లి తెలం గాణ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలలో శుక్రవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని పలు రకాల యోగాసనాలు వేశారు.

### షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

టేకుమట్ల, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని రామక్రిష్టాపూర్(వి)లో శుక్రవారం చోటుచేసు కుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడ్ల పోషాలు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో మంటలు చెలరేగి విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. బీరువాలో ఉన్న రూ.2లక్షల నగదు, 12 తులాల బంగారం, బట్టలతోపాటు ఇంట్లోని బియ్యం, నిత్యావసర సరుకులు కూలర్, ఫ్రిడ్జ్ కాలిపోయాయి. దీంతో సుమారు రూ.20 లక్షల నష్టం జరిగినట్లు బాధితుడు పోషాలు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్సై ప్రసాద్ పరిశీలించారు. 06ఎండిపి01: పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

### రాష్ట్ర శ్రేయస్సు కోరుతూ పూజలు

మహదేవపూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవాల్లో భాగంగా రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ కాళేశ్వరాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారి దేవాలయంలో ఉప ప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు అభిషేకాలు నిర్వహించారు. విశేష పుష్పార్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, సిబ్బంది, కాళేశ్వరం గ్రామస్థులు పాల్గొన్నారు.

### కేజీబీవీలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

మల్హర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారంలోని కేజీబీవీలో తాత్కాలిక ప్రాతిపాదికన గెస్ట్ లెక్చరర్‌గా పని చేయ డానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకో వాలని ప్రత్యేకాధికారి కొండ్ర మహేశ్వరి శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలోని సీఆర్‌టీ హిందీ, సీఆర్‌టీ ఇంగ్లిష్, సీఆర్‌టీ సోషల్ స్టడీస్, పీజీసీఆర్‌టీ నర్సింగ్‌లో బోధిం చడానికి గెస్ట్ లెక్చరర్‌గా పని చేయడానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నర్సింగ్ పోస్టుకు బీఎస్సీ నర్సింగ్, ఇంగ్లిస్, హిందీ, సోషల్ స్టడీస్ బోధించడానికి డిగ్రీతో పాటు బీఈడీ చేసిన మహిళలు ఈ నెల 10లోగా కళాశాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీఆర్‌టీలకు రూ. 18 వేలు, పీజీసీఆర్ టీకి రూ. 23 వేల వేతనం ఉంటుందని తెలిపారు.

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



ములుగు పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలు

ములుగు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ శ్రేణులు కార్యక్రమాలకు సిద్ధమవుతున్న క్రమంలో శుక్రవారం పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, నాయకులు దుర్గం రమణయ్య, పోరిక విజయ్‌రామ్, కోగిల మహేష్, ముదుతనపల్లి మోహన్, భైకని ఓదెలు, గొర్రె సమ్మయ్య, భైకని సాగర్, ఆదిరెడ్డి తదితరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కొంత సమయం తర్వాత సొంత పూచీకత్తుపై వదిలేశారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుదుముల లక్ష్మీనారాయణతో పాటు మండల మండల ప్రచార కార్యదర్శి చల్లగురుగుల తిరుపతి, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జులు గుడివాడ శ్రీహరి, బీసా సాంబయ్యను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. రోజంతా ఠాణాలో ఉంచి సొంంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా కుదుముల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అరెస్టులకు నిరసనగా ఆందోళనకు సిద్ధం కావడంతో ముందస్తుగా అరెస్టు చేయడం దారుణమన్నారు.

### అక్రమ అరెస్టులతో గొంతునొక్కే ప్రయత్నం

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం గొంతునొక్కే ప్రయత్నం చేస్తుందని, ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం సరికాదని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో గోవింద్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. మాజీమంత్రి హరీశ్‌రావు తెలంగాణ ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ఎన్నో ఉద్యమాలు చేశారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి సీఎంలు వైఎస్.రాజశేఖరరెడ్డి, నారా చంద్రబాబునాయుడులతో అనేకసార్లు పోరాటాలు చేశారని అన్నారు. అంతేకాకుండా జైలు జీవితం గడిపిన రోజులు కూడా ఉన్నాయని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి భయపడేదిలేదని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా, అరెస్టు చేసినా ప్రజలపక్షాన నిలబడి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, తెలంగాణ రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ముఖ్యంగా పాటుపడతామని అన్నారు. ఈసమావేశంలో నాయకులు రమేష్, కుమారస్వామి, రమేష్, అంతటి రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను సాధించే వరకు పోరాటం

### ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి

చిట్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో జాప్యం చేస్తూ మోసగిస్తోందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా వర్గీకరణ జరిగేంత వరకు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో పోరాటాన్ని సాగిస్తామని అన్నారు.

#### నూతన కమిటీ ఎన్నిక

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దొడ్డె శంకర్, ప్రధాన కార్యదర్శిగా కట్కూరి మొగిలి, మహిళా అధ్యక్షురాలిగా మట్టివాడ సుమలతను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు నేరేళ్ల ఓదెలు, నోముల శ్రీనివాస్, మేకల రమేష్, జేరుపోతుల ఓదెలు, రమేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాపాలన కళాయాత్ర

మల్హర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండలంలోని కొయ్యూర్, వల్లెంకుంట గ్రామాల్లో ప్రజాపాలన కళాయాత్రను నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలపై కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ఓనపాకల కుమార్, కమ్మల ప్రవీన్ కుమార్, ఆత్మకూరి మహేందర్, చీకట్ల శంకర్, మధుబాబు, శిరీష, సుమలత, సురేందర్, రాధిక, స్వాతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

### యూత్ కాంగ్రెస్ నాయకుడికి సన్మానం

కాటారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొంది మంథని నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన చీమల సందీప్‌ను పలువురు అయ్యప్ప దీక్షాపరులు, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సన్మానించారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. చీమల రాజు, భూపెల్లి రాజు, కామిడి వెంకట్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, చీమల సత్యం, గోనె శ్రీనివాస్, గడవేన దేవేందర్, రత్న సమ్మిరెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.